# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## ధరణి తీసేస్తే ఆగమైతం..

పెద్దవంగర : బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ చాలా బాగున్నది. రైతులకు ఎంతో మేలు జరగుతున్నది. ఈ పోర్టల్ ద్వారా ఆరగంటలో భూమి ఒకరి పేర నుంచి మరోకరి పేరుకు మార్పిడి జరుగుతున్నది. 15రోజుల్లో పాస్ పుస్తకం ఇంటికి వస్తున్నది. రూపాయి లంచం ఎవరికీ ఇయ్యాల్సిన పని లేదు. తహసీల్దార్ ఆఫీసులో వేలిముద్ర వేస్తేనే మన భూమి ఓపెన్ అవుతున్నది. మన భూమి ఎక్కడికీ పోదు. గతంలోనైతే పనులు కావాల్నంటే ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. కాంగ్రెస్ వస్తే ధరణిని తీసేస్తామంటున్నారు. అలా అయితే పాత రోజులు, సమస్యలు తప్పవు. గతంలో కింది నుంచి పైదాకా ప్రతి అధికారికీ లంచం ఇస్తనే పనయ్యేది. గిప్పుడు మళ్లా ఆ రోజులే కాంగ్రెస్ తీసుకొస్తానంటాంది. గట్ల చేస్తే మాలాంటి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతరు.

**- నీరటి యాకన్న, కొరిపెల్లి, పెద్దవంగర మండలం**



## కాంగ్రెసోళ్ల మాయమాటలు ఎవలు నమ్ముతరు..?

గార్ల : ధరణి పోర్టల్ రైతుకు భరోసా ఉన్నది. దాన్ని తీసివేసేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తున్నది. వాళ్ల రాజకీయ అవసరాల కోసం ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నరు. వారికి భూములపై హక్కు లభించింది. 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ అవుతాంది. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో రైతుల భూములకు భరోసా నిచ్చింది. కాంగ్రెస్ వస్తే గతంలో వలే పట్వారీ, దళారులు వ్యవస్థ పెరిగి అధికారులు అందినకాడికి దోచుకుంటరు. ధరణితో ఎంతో మంది రైతులకు భూమిపై హక్కు పొందారు. కాంగ్రెసోళ్ల మాయమాటలను రైతులు ఎవ్వరూ నమ్మరు. తెలంగాణ రైతన్నలకు రైతుబంధు, రైతు బీమా పథకాలతో కుటుంబానికి అండగా నిలుస్తున్నది. సీఎం కేసీఆర్ సార్‌కు కృతజ్ఞతలు. మళ్లీ బీఆర్ఎస్ సర్కారే రావాలి.

**- శీలంశెట్టి శ్రీనివాస్‌రావు, రైతు, గార్ల**

## పట్వారీ వ్యవస్థ తెస్తామన్నోళ్లకు బుద్ధి చెప్తం..



గంగారం : రైతులు మంచిగా ఉండడం కాంగ్రెసోళ్లకు నచ్చుదు. ధరణి పోర్టల్ తీసేస్తే మళ్లీ పట్వారీ వ్యవస్థ తప్పదు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల భూముల భద్రత కోసం ధరణి పోర్టల్ ప్రవేశ పెట్టడం చాలా సంతోషం. తద్వారా రైతు భూమిపై పూర్తి హక్కు కలిగి ఉంటున్నాడు. గతంలో రికార్డుల్లో పేర్లు మార్చుకోవాలంటే అరిగోస పడ్డాం. డబ్బులు ఇవ్వకుండా పని అయ్యేది కాదు. ఏండ్లు అధికారుల చుట్టూ తిరిగినం. సీఎం కేసీఆర్ వచ్చినంక తొందరగా భూమి రిజిస్ట్రే అవుతాంది. ధరణి పోర్టల్‌ను తొలగిస్తే మళ్లీ పట్వారీ వ్యవస్థ మొదలై జేబులు ఖాళీ అవడం ఖాయం. ఎవరెన్ని చెప్పినా రైతులను ఆదుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ రావాలె.

**- మోకాళ్ల బాబు, రైతు, మడగూడెం**

## మళ్ల దళారుల రాజ్యం మనకు అవసరమా?



నెల్లికుదురు: సీఎం కేసీఆర్ తెచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులు తమ భూములకు రక్షణ ఉందంటూ దర్జాగా ఉంటున్నారు. కలెక్టర్ కాదు కదా సీఎం చెప్పినా భూమి మరొకరి పేరుకు మారదు. నాడు భూముని సాగు చేసేదొకడు.. కాస్తులో ఉండేది ఒకడు. మధ్యదళారులు వచ్చి పైసలు తీసుకొని ఇష్టమొచ్చినట్లు రికార్డులు మార్చేది. రైతులు సరిపడా నీళ్లు, కరెంట్ లేక అష్టకష్టాలు పడుతూ పంటలు పండించుకునేది ఒకెత్తు. ఆ భూమిని ఇంకొకరికి మారకుండా కాపాడుకోవడం మరొక ఎత్తు. పహాణి కావాలంటే పైసలు, 1బీ కావాలంటే కూడా పైసలే. చెప్పులరిగేలా తిరుగాల్సి వచ్చేది. కేసీఆర్ ధరణి పోర్టల్ తేవడంతో రైతుల కష్టాలు పోయినయ్. కాంగ్రెస్ వస్తే మళ్లీ పాత పద్ధతులతో పడరాని పాట్లు పడాల్సి వస్తది. అయినా కాంగ్రెస్ వచ్చేదుందా.. సచ్చేదుందా?

**- యాసం రమేశ్, రైతుబంధు సమితి గ్రామ కోఆర్డినేటర్, నైనాల**

'దేశాన్ని దాదాపు 60ఏండ్లు పాలించిన కాంగ్రెస్, రైతుల కష్టాలను ఏనాడైనా తీర్చిందా.. నాడు కరెంటు ఎప్పుడు వస్తదో ఎప్పుడు పోతదో తెల్వని పరిస్థితి. రాత్రిపూట చేన్లకాడికి పోయి పాములు, విష పురుగులు కుట్టి ఎంతమంది సచ్చిపోయిన్రు.. ఉండీలేని కరెంటు తోని పొలాలు తడువక ఎన్నిసార్లు పంటలు ఎండిపోయినయ్.. అవన్ని ఎట్ల మర్శిపోతం..' అంటున్నరు రైతులు. వ్యవసాయానికి కాంగ్రెస్ మూడు గంటల కరెంటు చాలంటున్నదని, మూడు గంటలతోటి మూడు మడులు కూడా తడువయని, ఎద్దు, ఎవుసం తెల్వనోళ్లు ఇలానే మాట్లాడుతరని ఎద్దేవా చేస్తున్నారు. 10హెచ్‌పీ మోటర్లకు కరెంటు ఎంతకావాలె.. ఇప్పుడు రైతుల పొలాలన్నిటికీ 10 హెచ్‌పీ మోటర్లు ఎవరు పెట్టాలె అని ప్రశ్నిస్తున్నారు. అంతపెద్ద మోటరు పెడితే బోరు బావుల్లో ఊట ఉంటదా అని అడుగుతున్నారు. కాంగ్రెస్ వాళ్ల వల్లే తాము చేతుల్లో పైసలు లేక బక్కవడ్డమని, తెలంగాణ ప్రభుత్వం వచ్చాకనే నాలుగు పైసలు కనవడుతున్నయని చెబుతున్నారు. 24గంటల కరెంటు తోని ఇప్పుడు రంది లేకుంట ఎవుసం చేసుకుంటున్నామని, మళ్లీ పాతరోజులు వద్దని తెగేసి చెబుతున్నారు. ధరణిని తీసేసి భూమాతను తెస్తామని కాంగ్రెస్సోళ్లు అంటున్నారని, వాళ్ల తీరు చూస్తుంటే మళ్లీ దళారుల వ్యవస్థను తెచ్చి దండుకోవాలని చూస్తున్నారని అర్థమవుతోందంటున్నారు. ఇప్పుడు ధరణిలో భూముల రిజిస్ట్రేషన్లు నిమిషాల్లోనే పూర్తవుతున్నాయని, చాలా సమస్యలు పరిష్కారమై సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇంత మంచి పోర్టల్‌ను తీసేసి మళ్లా కొట్లాటలు పెట్టే పాత వ్యవస్థను తెస్తామనడం ఏం పద్ధతని ప్రశ్నిస్తున్నారు.

**- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 22**




# పాత రోజులు వద్దే వద్దు

**మూడు గంటల కరెంటుతో మూడు మడులు కూడా పారవు**

**ఇప్పుడే మంచిగ నడుస్తాంది**

**10హెచ్‌పీ మోటర్లు పెడితే నీళ్లు ఆగుతయా?**

- అంత ధరపెట్టి ఎవరు కొనాలె?
- కాంగ్రెస్సోళ్లు సోయుండే మాట్లాడుతున్నరా?
- ధరణి తీసేస్తే మళ్ల గోసనే.. దళారుల వ్యవస్థ వస్తే ఆగమైతం
- తెగేసి చెబుతున్న కర్షకలోకం



## ధరణి వల్లే ధైర్యంగా ఉన్నాం..

బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల పట్టా పుస్తకాలు రావడంతో ధైర్యంగా ఉన్నాం. ధరణి లేని సమయంలో మ్యానువల్ పద్ధతిలో రికార్డులు ఉండడం, రెవెన్యూ ఉద్యోగులు ఇష్టం వచ్చినట్లు రికార్డులు తారుమారు చెయ్యడంతో భూ యజమానికి తెల్వకుండానే భూమి ఇంకొకరి పేరు మీదకు మారేది. అప్పుడు రైతులు చాలా ఇబ్బంది పడేవారు. కానీ ధరణి తీసుకొచ్చినంక భూ యజమానికి తెల్వకుండా ఇంచు భూమి కూడా మరొకరి పేరు మీదకు నమోదు అయ్యే ప్రసక్తి లేదు. భూములపై పూర్తి హక్కు యజమానికే లభించింది. కానీ కాంగ్రెసోళ్లు ధరణి తీసేసి పాత పద్ధతి తీసుకొస్తే రైతుల భూములకు రక్షణ ఉండదు. మళ్లీ పటేల్, పట్వారి వ్యవస్థ వస్తది. రైతుల భూ హక్కులు తారుమారు కావడం ఖాయం. భూములపై సరైన హక్కు లేకుంటే భూముల రేట్లు కూడా పడిపోతయి.

**-అడిదల వీరభద్రం, రైతు, బయ్యారం**



## ధరణితోనే భూములకు విలువ

గూడూరు: సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తీసుకురావడంతో మా భూములకు విలువ పెరిగింది. గతంలో రైతులకు భూమి ఉన్న మాటే కానీ ఆ భూమిపై యాజయాన్య హక్కులు ఉండేవి కావు. నేడు మా గ్రామంలో ధరణితో మా భూములకు మా పేరునే ఉండి భద్రత కలగడమే కాకుండా భూములకు కూడా విలువ పెరగడంతో సంతోషం గా ఉన్నాం. దీంతో రైతుబంధు, రైతు బీమా సకాలంలో వస్తున్నది. గత ప్రభుత్వాల పాలనలో ఏళ్ల తరబడి వీఆర్‌వో, తహసీల్దార్ ఆఫీస్‌ల వెంట తిరిగేవాళ్లం. ఇప్పుడు ఆ అవసరం లేదు. మా భూములు ఎంత భద్రంగా ఉన్నాయో ఒక్క చిటికెల తెలుసుకుంటున్నం. ఇంకొకరు వచ్చి ఆక్రమించే సమస్యే లేదు. ధరణి తీసివేస్తాం అన్న నాయకులను మా ధరిలోకే రానివ్వం, రైతులంతా గమనిస్తున్నాం. తమకు సహాయం చేసే మా ఇంటి పార్టీకే అండగా ఉంటాం.

**- నాయిని భిక్షపతి, రైతు, గాజులగట్టు**

## మాకు 24 గంటల కరెంట్ కావాలె..

దంతాలపల్లి : గత ప్రభుత్వాల పాలనలో నీళ్లు లేక, కరెంట్ లేక భూమి బీడుగా మారింది. బతకడమే చానా కష్టమైంది. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పూడికతీత పనులు చేపట్టి కట్టలను నిర్మించిన్రు. దీంతో భూ గర్భజలాలు మస్తు పెరిగినయ్. బావి తవ్వుకున్న. మోటర్ పెట్టుకొని పొలంలో పత్తి, మిరప పండిస్తున్న. మంచిగ బతుకుతున్నం. అంత మంచిగ ఉన్నదనుకుంటే ఈ కాంగ్రెసోళ్లు మళ్లీ మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్నరు. ఈ కరెంట్‌తో మొదటి మడి కూడా పారదు. ఇంకా 10హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలంటున్నది. ఎట్ల పెట్టుకుంటరు. ఎవరూ కొనిస్తారు.. మోటర్ కాంగ్రెస్ వాళ్లు కొనిస్తరా.. చెప్పాలి. కాంగ్రెస్‌ను నమ్మితే మళ్లీ పాత కథే అయితది. మాకు మూడు గంటల కరెంట్ వద్దు.. 24 గంటలే కావాలి.

**- కోరిపెల్లి మహేందర్‌రెడ్డి, దంతాలపల్లి**



## 10 హెచ్‌పీ మోటరుతోటి మేం ఆగం కావాల్నా..?



ఇనుగుర్తి: మాది వ్యవసాయ కుటుంబం. సీఎం కేసీఆర్ పాలనలో రైతు రాజుగా ఉన్నాడు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఎప్పుడు వస్తుందో తెల్వదు. రైతులు వ్యవసాయం చేసే పరిస్థితి ఉండేది కాదు. కాంగ్రెస్ నాయకుడు రేవంత్ రెడ్డి వ్యవసాయానికి 3 గంటల కరెంటు చాలు.. 10 హెచ్‌పీ మోటర్లు తెచ్చి పెట్టుకోవాలని చెప్తాండు. ఇది రైతులకు తలకు మించిన భారం. అందరు రైతులు ఒకేసారి మోటర్లు వేస్తే భూగర్భ జలాలు అడుగంటి పోతాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవు. వ్యవసాయం చేసే పరిస్థితి కూడా ఉండదు. 10 హెచ్‌పీ మోటర్లతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడి వ్యవసాయాన్ని మానేసి బతుకుదెరువు కోసం పట్టణాలకు వలసలు వెళ్లే పరిస్థితులు వస్తయి. రైతులంతా కేసీఆర్ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారు. కాంగ్రెస్‌కు పాలన అప్పగిస్తే రైతులు చీకట్లోకి పోయినట్లే.

**- ఇస్లావత్ శ్రీధర్, రైతు, పాతతండా, ఇనుగుర్తి**

## 3 గంటలిత్తే ఒక్క మడి సుత పారది..



గూడూరు: కాంగ్రెసోళ్లు ఇస్తామన్న 3గంటల కరెంట్‌తో ఏం చేస్తాం. కనీసం ఒక్క మడి కూడా తడవదు. సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇచ్చి మా పంటలకు ప్రాణం పోసిండు. తండ్రిలా పాలన చేస్తున్న ఆయనకే మా మద్దతు. పదేళ్లుగా నా పంటకు ఎప్పుడు స్విచ్ వేస్తే అప్పుడు నీళ్లు వస్తున్నయ్. గంగమ్మ మా చెంతనే ఉన్నది. గంగమ్మను తీసుకొచ్చిన కేసీఆర్ సారు రుణం ఏవిధంగా తీర్చుకుంటం. మూడు గంటల కరెంట్ ఇచ్చేటోళ్లు ఎలా వ్యవసాయం చేస్తరో నాకు అర్థం కావడం లేదు. 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలట కదా.. మరి ఎక్కడినుంచి తేవాలి. ఇప్పు డున్న కరెంట్, నీరు చాలా మంచిగుంది. మళ్లీ వేరెటోళ్లను ఎందు కు నమ్ముతం. తెలంగాణ రాక ముందు మా రైతుల బతుకు లు ఎట్ల ఉన్నయో మాకు తెలుసు. ఇప్పుడు వ్యవసాయం చేసుకుంట మంచిగ ఉన్నం. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మేదే లేదు.

**-బొమ్మగాని స్వరూప, రైతు, అయోధ్యపురం**




## రైతులకు అన్నీ ఇచ్చిన బీఆర్ఎస్‌కే మా మద్దతు..

కేసముద్రం: కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తది. అధికారంలోకి వస్తే పంటలు ఎండిపోయి ఆర్థికంగా నష్టం జరుగుతుంది. 3 గంటల కరెంట్‌తో పంటనను పండించలేక, పెట్టిన పెట్టుబడి రాక అప్పుల్లో కూరుకపోతాం. 3 గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్‌తో ఆర ఎకరం కూడా పారదు. 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవడానికి వీలు ఉండదు. రేవంత్‌రెడ్డి వ్యవసాయంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నడు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సబ్‌స్టేషన్ల ఎదుట రైతులు ధర్నాలు చేసినట్లు మా నాన్న చెప్పిండు. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత కరెంట్ బాదే లేదు. వ్యవసాయం చేయడానికి ఇబ్బంది లేకుండా మాకు సీఎం కేసీఆర్ సార్ అన్ని సౌకర్యాలు కల్పించాడు. 24 గంటల కరెంట్ ఇవ్వడంతో వీలు కలిగినప్పుడు పంటలకు నీరు పారిస్తున్నాం. మాకు ఎలాంటి సమస్య లేకుండా చేసిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. బీఆర్ఎస్‌కే మా మద్దతు ఉంటది.

**- కుదురుపాక ఉపేందర్, రైతు, కల్వల**



## కాంగ్రెస్ వస్తే కష్టాలు మొదలైనట్టే

గార్ల: కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంట్ ఇస్తే ఇక రైతుకు మళ్లీ పాత రోజులు వస్తాయి. నాడు కాంగ్రెస్ ఉన్నప్పుడు వ్యవసాయం చేయాలంటే రైతులు ముందుకు వచ్చేది కాదు. రైతులను గోస పెట్టి పట్టించుకోలేదు. వచ్చీరాని కరెంట్ ఇచ్చి ఆగం చేశిన్రు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంకనే సీఎం కేసీఆర్ పుణ్యమా అని 24గంటల ఉచిత విద్యుత్ వస్తున్నది. ఇప్పుడు రైతులంతా సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నరు. ఓర్వలేని రేవంత్‌రెడ్డి మూడు గంటలు రైతులకు సరిపోతదని డ్రామాలు చేస్తున్నడు. రాజకీయ లబ్ధి కోసం రైతులను కాంగ్రెసోళ్లు వాడుకుంటున్నరు. సీఎం కేసీఆర్ రైతుకు అనేక విధాలుగా అండగా నిలిచి, రైతును రాజు చేసిండు. మాళీ కేసీఆర్ సారే రావాలె.

**-సుధా మైసయ్య, రైతు, గార్ల**



## నాడు గోస పడ్డది చాలు..



కురవి : కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కరెంటు కష్టాలు మొదలైనట్టే. రాత్రిపూట కరెంటుతో ఎన్ని కష్టాలు పడ్డమో.. ఆ రోజులను గుర్తు చేసుకుంటే వణుకొస్తది. అర్థరాత్రి 11గంటలకే బాయి కాడికి పోయేటోళ్లం. నిమిషం లేటయినా లో వోల్టేజీతో స్టార్టర్ ఆన్ కాకపోయేది. ఇంకోరోజు పోయే సరికి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయేది. అదిబాగు చేసేందుకు రైతులందరూ డబ్బు లేసుకొనేసరికి అదనుపోయేది. అయినా రైతుకు సాయం సాయం చేయాలనే ఆలోచన రావాలంటే ఎదుటోడు కూడా రైతయ్యి ఉండాలి. కేసీఆర్ నిజమైన రైతు. అందుకే ఎవరు ఎన్ని చెప్పినా మోటర్లకు మీటర్లు పెట్టలె. రైతులు ఒక్కసారి ఆలోచించాలి. తెలంగాణ వచ్చినంకనే మన రాత మారింది. మళ్లీ మన రాతను చెడగొట్టుకునే పనులు చెయొద్దు.

**- సముద్రాల శ్రీనివాస్, ఉప్పరిగూడెం**